క్లుప్తంగా

పోషకాహార దినోత్సవం



పోషకాహార తయారీలో విద్యార్థుల తాతమ్మలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం విద్యార్థుల తాతమ్మలతో కలిసి పోషకాహార దినోత్సవం నిర్వహించారు. నూనె వినియోగించకుండా ఆహారం తయారు చేశారు. విద్యార్థులకు రుచులు తినిపించారు. విద్యార్థులను అలరిస్తూ ఆటపాటల్లో మునిగితేలారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవిందరెడ్డి, ప్రిన్సిపాల్ అయూబ్, అకడమిక్ కో–ఆర్డినేటర్ రోజారాణి, ఇన్‌చార్జి క్రిష్ణవేణి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు హద్దులు



హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

భీమారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామ పరిధిలో నిర్మించే 33/11కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం సర్వేనంబర్ 466లో కేటాయించిన ఎకరం భూమిలో శనివారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో భూమి కేటాయించినా, హద్దులు నిర్ణయించలేదు. ఇప్పుడు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశతో హద్దులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సివిల్ ఏఈ శ్రీనివాస్, సర్వేయర్ నాగరాజులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత

తాండూర్: మండలంలోని మాదారం–3 ఇంక్లెన్ గని బంకర్ వద్ద ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్ తెలిపారు. బంకర్ వద్ద ఉన్న మట్టిని ట్రాక్టర్లో లోడ్ చేస్తుండగా అటువైపుగా వెళ్లిన మొబైల్ టాస్క్‌ఫోర్స్, సింగరేణి ఎస్ అండ్‌పీసీ సిబ్బందిని చూసి ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాక్టర్లను వదిలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకొని ఆ మూడు ట్రాక్టర్లను మాదారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్పెషల్ టీం సిబ్బంది సార్ల రమేష్, ఎం.శ్రీనివాస్, సీహెచ్ అనిల్‌కుమార్, దశరథ్‌లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అతిథి అధ్యాపకుడు సతీష్‌కుమార్ పీహెచ్‌డీ పూర్తి చేసి, గౌరవ డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ తెలిపారు. హర్యానా రాష్ట్రంలోని నీలం యూనివర్సిటీ ద్వారా ప్రొఫెసర్ డాక్టర్ అమరావతి పర్యవేక్షణలో దివ్యాంగుల కోసం అనుకూల సాధనాలను అభివృద్ధి పర్చడంలో కృత్రిమ మేధ పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి, పట్టా సాధించినట్లు తెలిపారు. డాక్టరేట్ పట్టా సాధించిన అధ్యాపకుడు సతీష్‌కుమార్‌ను సిబ్బంది పలువురు అభినందించారు.

ప్రశంసాపత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు అందిస్తున్న జీఎంలు

శ్రీరాంపూర్: డిస్పెన్సరీలో ఉద్యోగుల ఈపీఆర్ రికార్డులను డిజిటలైజేషన్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను శనివారం ఆర్కే 8 డిస్పెన్సర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎంలు అభినందించారు. ప్రశంసాపత్రాలు అందించి వారి పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, సీఎంవో డాక్టర్ కిరణ్ రాజ్, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, వైద్యులు మురళీధర్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 6న మందకృష్ణ మాదిగ సభ

భీమారం: జైపూర్ మండల కేంద్రంలో సెప్టెంబర్ 6న వృద్ధులకు, వింతవులకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని మండల ఇన్‌చార్జి ఇరుగాల మల్లేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సకినారపు మల్లేశ్, గాలిపల్లి సత్యనారాయణ, జంగంపల్లి పున్నంచందు, నిట్టూరి సుధాకర్, వేల్పుల సతీష్ పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు కలేనా?

- భీమారంలో జూనియర్ కళాశాల లేక విద్యార్థుల ఇబ్బందులు
- ఇంటర్ విద్యకోసం జైపూర్, చెన్నూర్, మంచిర్యాలకు..
- దూరభారంతో ఇక్కట్లు



భీమారంలో కళాశాల నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలం

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 11పంచాయతీ లు ఉండగా, వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదివిన అనంతరం స్థానికంగా ఇంటర్ జూనియర్ కళాశాల లేకపోవడంతో వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇంటర్ విద్య కోసం జైపూర్, చెన్నూర్, మంచిర్యాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లి వస్తున్నారు. దూరభారంతో ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం జైపూర్ వెళ్లడానికి, సాయంత్రం రావడానికి విద్యార్థులకు ఆటోలు, ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. భీమారం చుట్టు పక్కగ్రామాల విద్యార్థులు ప్రతీరోజు జైపూర్ వెళ్లడం ఇబ్బందిగా మారింది. అక్కడ చదివేవారు భీమారం మండలానికి చెందిన విద్యార్థులే ఉండటం గమనార్హం. కాగా, కళాశాల ఏర్పాటు కోసం తాత్కాలికంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో భవనాలు ఉపయోగపడే అవకాశముంది. కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

గతంలోనే కళాశాల ఏర్పాటుకు హామీ

మండల కేంద్రం కాకముందే (ఇంకా జైపూర్‌లో కళాశాల లేదు) భీమారంలో అప్పట్లో కళాశాల ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీనిపై స్థానికులు కళాశాల ఏర్పాటు చేయాలని ఒత్తి డి తెచ్చినా అది ఫలితాలు ఇవ్వలేదు. చివరకు అప్పటి ఉమ్మడి మండలమైన జైపూర్‌లో ఏర్పాటు చేశారు.

1967లో జెడ్పీ ఉన్నత పాఠశాల మంజూరు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ తాలూకా ఉన్న సమయంలో 1967లో ప్రభుత్వం భీమారంలో జెడ్పీ ఉన్నత పాఠశాల మంజూరు చేసింది. ఇక్కడ నాణ్యమైన విద్య అందించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది భీమారంలోని గిరిజన వసతి గృహంలో ఉండి పదో తరగతి పూర్తి చేశారు. గిరిజన, ఎస్సీ, బీసీ వసతి గృహాలు ఏర్పాటుతో విద్యకి భీమారం మారుపేరుగా మారింది.

కళాశాల ఏర్పాటు చేయాలి



నర్సింగాపూర్‌లో 11 మంది విద్యార్థులం చదువుతున్నాం. పదో తరగతి తర్వాత ఇంటర్ విద్య కోసం దూరం వెళ్లాలి. భీమారంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– సుజిత్ కుమార్, పదోతరగతి, నర్సింగాపూర్

ప్రజలు కోరితే ప్రతిపాదనలు

కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజల పక్షాన లిఖితపూర్వకంగా దరఖాస్తు చేస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఇప్పటి వరకు భీమారంలో కళాశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు లేవు.

– అంజయ్య, డీఐఈవో

మళ్లీ కన్నీరే మిగిలింది...

- గోదావరితీరంలో జలమయంగా మారిన పంట పొలాలు



వేలాలలో నీట మునిగిన పంట పొలాలు

జైపూర్: ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు మళ్లీ కన్నీరే మిగిలింది. ఈ ఏడాది మళ్లీ వరద రావడం గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో గోదావరితీర ప్రాంత పంట పొలాలు జలమయంగా మారాయి. పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జైపూర్ మండలం కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, గోపాల్‌పూర్, శివ్వారం గ్రామాల్లో సుమారు 2వేల 200ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అప్పులు చేసి, పెట్టుబడులు పెడితే పంట చేతికి రాక నష్టాల పాలవుతున్నట్లుగా వాపోతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

చెన్నూర్: చెన్నూర్ గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. పరివాహక ప్రాంతంలోని పత్తి, వరి పంటలు నీట మునిగాయి. గోదావరి నది ఒడ్డు పైకి నీరు చేరింది. పుష్కర ఘాట్ సమీపంలో జామతోట పూర్తిగా నీటిలో మునిగింది. నీటి ప్రవాహం పెరిగితే పరివాహక ప్రాంతంలోని పంటలతో పాటు చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి, శివలింగాపూర్ ప్రాంతాల్లోని పంట పొలాలు నీటి మునిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

వరద బాధిత కుటుంబానికి రూ. 25వేలు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: వరదతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.25వేల నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్‌లో వరద వచ్చిన ప్రాంతాలను శనివారం బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. వరద ప్రభావిత బాధితులకు శాశ్వత ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అమిరిశెట్టి రాజేకుమార్, ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీశ్‌రావు, మేడికొండ శ్రీనివాస్, బింగి ప్రవీన్, సత్యనారాయణ, బియ్యాల సతీశ్‌రావు, జయరామరావు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్‌నగర్, రాంనగర్ కాలనీల్లో శనివారం పర్యటించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, నాయకులు మిడివెల్లి రాజు, పాయిరాల రాములు, నాయకులు పాల్గొన్నారు.

మేము బతుకుడెట్లా..



ఏటా వరదలు వస్తన్నయ్. రూ.వేలల్లో అప్పులు తెచ్చి పంటలకు పెట్టుబడులు పెడుతున్నాం. తీర పంటలు చేతికొచ్చేసరికి వరదలు ముంచుతున్నయ్. చేసిన అప్పులు తీర్చలేక, మళ్లీ పంటకు పెట్టుబడి పెట్టలేక అరిగోస పడుతున్నం. ఇక బతుకుడే కష్టం ఉన్నది. పదెకరాల్లో పత్తి వేసిన మొత్తం వరద నీళ్లు వచ్చి మునిగింది.

– ముత్యాల సారగౌడ్ (వేలాల రైతు)

పరిశుభ్రత, ఆరోగ్య భద్రతతో ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలు కేవలం శుభ్రతలోనే కాదు.. పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, శానిటేషన్, విద్యార్థుల ఆరోగ్య భద్రతా అంశాల్లోనూ ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉందని డీఈవో యాదయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌హెచ్‌వీఆర్‌పై జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పచ్చదనం–పరిశుభ్రత ఆధారంగా పాఠశాలకు రేటింగ్ ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల తప్పనిసరిగా సెప్టెంబర్ 15లోపు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎస్‌హెచ్‌వీఆర్ రిజిస్ట్రేషన్ విధానం, మొబైల్‌యాప్, వెబ్‌పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేయటం, 60 సూచికల ఆధారంగా స్వీయ అంచనా ప్రక్రియ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కో– ఆర్డినేటర్లు చౌదరి, సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, రిసోర్స్ పర్సన్ దత్తకుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి స్పందన

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్రశిక్ష, కేంద్ర ప్రభుత్వ సంస్థ అలీంకో సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి స్పందన లభించింది. జిల్లాలోని 11మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించగా 105 మంది విద్యార్థులను ఎంపిక చేయగా 94మంది దివ్యాంగులు అర్హత పొందారు. వీరికి సమగ్రశిక్ష, అలీంకో ద్వారా ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మిగిలిన ఏడు మండలాల విద్యార్థులకు సెప్టెంబర్ 1న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్లు చౌదరి, సత్యనారాయణమూర్తి, డీఎస్‌వో రాజగోపాల్, ఎంఈవో మాలతీదేవి, అలీంకో డాక్టర్లు రుక్మిణి, ఓం, ఐఈఆర్పీ ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు త్వరితగతిన సేవలు



మాట్లాడుతున్న బ్యాంకు సీఈవో కేవీఎస్‌ఎన్ మూర్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 48వ సర్వసభ్య సమావేశాన్ని బ్యాంకు సొంత భవనంలో శనివారం బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుకు 2024–2025 ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.88.13లక్షల నికర లాభం వచ్చిందని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరం కన్నా రూ.11.78లక్షలు ఎక్కువ లాభం వచ్చిందన్నారు. 2024–2025 సంవత్సరానికి గాను వాటాదారులకు 12శాతం డివిడెండ్ ప్రకటించారు. త్వరలో గోదావరిఖని, భూపాలపల్లిలో బ్రాంచీలు ప్రారంభిస్తామన్నారు. అనంతరం బ్యాంకు సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తున్నామని, ఖాతాదారులకు త్వరితగతిన సేవలు అందేలా చూస్తున్నామన్నారు. త్వరలో ఐఎంపీఎస్, యూపీఐ సేవలు అందిస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక అభివృద్ధికి తమబ్యాంకు కట్టుబడి ఉందన్నారు. బ్యాంకు ప్రగతి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న వాటాదారులకు, ఖాతాదారులకు, రిజర్వు బ్యాంకు, సహకార శాఖ, మున్సిపల్ అధికారులకు, బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జీ.పూర్ణ చందర్‌రావు, డైరెక్టర్లు కేఎస్‌ఎం రావు, ఆర్.ప్రసాదరావు, జీ.కృష్ణమూర్తి, జే.శ్రీదేవి, జీ.రాజలింగు, కే.బక్కయ్య, బి.భాను ప్రకాశ్, కే.రత్నం, కే.సుశీల, ఎస్.భాగ్యలక్ష్మి, ఐవీఎస్ఎస్ ఆదిత్య, వాటాదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు తీర్చాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నెలకొన్న యూరియా కష్టాలు తీర్చాలని, వెంటనే 1000 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కోరుతూ శనివారం బీజేపీ నాయకులు, రైతులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి భూక్య ఛత్రునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ.. జిల్లాలో దళారులు కృత్రిమంగా సృష్టించిన యూరియా కొరత వల్ల రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. వ్యవసాయ అధికారుల సమన్వయ లోపం వల్లనే యూరియా కష్టాలు జిల్లాలో ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు దళారులతో కుమ్మక్కై కృత్రిమంగా యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృత్రిమ కొరత, పక్కదారి పట్టిస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బోధన సామగ్రి ప్రదర్శన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్‌లకు సంబంధించిన మండల స్థాయి బోధన సామగ్రి ప్రదర్శనను శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శైలజ హాజరై బోధన సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యశోధర, పర్వీన్ సుల్తానా, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి విధుల బహిష్కరణ

దండేపల్లి: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబర్ ఒకటి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రమేష్‌కు శనివారం నోటీసు అందించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహేందర్, చంద్రగౌడ్, సువర్ణ, పోసవ్వ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ వినతితోనే హాల్టింగ్'



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్, నాగ్‌పూర్‌ల మధ్య నడిచే వందేభారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్‌ను ఇవ్వాలని గతేడాది సెప్టెంబర్ 19న సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో పాటు, రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ కల్పించారని పేర్కొన్నారు. వందేభారత్ రైలు మంచిర్యాలలో హాల్టింగ్ చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, హాల్టింగ్‌ను కల్పించినందుకు మంత్రికి, రైల్వే అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ పోరాటంతోనే...

మంచిర్యాలటౌన్: బీజేపీ నాయకుల పోరాట ఫలితంగా రైల్వేబోర్డు మంచిర్యాలలో హాల్టింగ్ కల్పించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాలలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ కల్పించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రిని, రైల్వే బోర్డు చైర్మన్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు, అందుకే మంచిర్యాలలో హాల్టింగ్ కల్పించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనగందుల కృష్ణమూర్తి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, దుర్గం అశోక్, గాజుల ముఖేశ్‌గౌడ్, అమిరిశెట్టి రాజేకుమార్, కుర్రె చక్రవర్తి, కమలాకర్‌రావు, ముత్తె సత్తయ్య, జోగుల శ్రీదేవి, మంత్రి సురేఖ, ఠాకూర్ ఉదయ్ శ్రీ, వైద్య శ్రీధర్, మహీధర్ గౌడ్, బొలిశెట్టి అశ్విన్ పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కృషితోనే...

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిరంతర కృషి ఫలితంగానే మంచిర్యాలలో రైలుకు హాల్టింగ్ ఇచ్చారంటూ రైల్వేస్టేషన్‌లో శనివారం కాకా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది నుంచి ఎంపీ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, రైల్వే బోర్డు చైర్మన్లను కలిసి వినతిపత్రాలను అందించారన్నారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్, కాకా అభిమాన సంఘం నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, తాజ్‌బాబా, చిట్టి బాషా, అంజత్, రజాక్, శ్రీధర్, రవి, జుబేర్, జాకీర్ పాల్గొన్నారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల వద్ద శనివారం గణనాథుడికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఏ జోన్ తారకరామకాలనీలో గల తారకగణేష్ మండలి వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు హాజరయ్యారు.

అన్నదానం

వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేమనపల్లి మండలంలోని నీల్వాయిలో డీజే గణేశ్ మండలి వద్ద విగ్రహ దాత మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేషుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. హాజీపూర్ మండలం గుడిపేటలో అన్నప్రసాద వితరణ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక యూనివర్సల్ గణేశ్ మండలి నిర్వాహకులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా 100మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

శ్రీరాంపూర్: వినాయక నిమజ్జనం రోజున జరిగే వేడుకలకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజుకిరణ్ కోరారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదపండితులను సంప్రదించి తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 6న నిమజ్జనం చేయాల్సిందిగా వినాయక మండపాల నిర్వాహకులకు సూచించారు. ఇతర మతాలకు పండుగ నిధులు ఇస్తున్నట్లుగానే నిమజ్జనం రోజున కూడా ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. శోభాయాత్ర ఘనంగా జరిగేందుకు పోలీసులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కర్నికంటి రవీందర్, నస్పూర్ మండల అధ్యక్షుడు ఎర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి చదరపు శ్రీనివాస్, జిల్లా నాయకులు నవీన్, రాజేందర్, గొల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో నిమజ్జన స్థల పరిశీలన

తాండూర్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తాండూర్ మండలంలో గురు, శుక్రవారాల్లో జరిగే గణపతి నిమజ్జన ప్రాంతాలైన పెద్ద చెరువు, రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్ బ్రిడ్జిలను అధికారులు, నాయకులు శనివారం పరిశీలించారు. వినాయక శోభాయాత్రల సందర్భంగా తీసుకోవాలిన చర్యలపై సీఐ దేవయ్య పలు శాఖల అధికారులు, నాయకులతో చర్చించారు.

చట్టాలు, హక్కుల గురించి తెలుసుకోవాలి

జన్నారం: ప్రతి ఒక్కరికి చట్టాలపై, హక్కుల గురించి తెలిసి ఉండాలని, వాటిపై అవగాహన ఉంటే మన సమస్యలు, మనమే పరిష్కారం చేసుకోగలుగుతామని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌లు పేర్కొన్నారు. పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం జన్నారం మండలంలోని బాదంపల్లిలో అవగాహన కల్పించారు.

రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి

తాండూర్: భారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ కల్పనకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రణయ్‌కుమార్, శంకర్, దత్తాత్రేయరావు, చంద్రశేఖర్, శ్రీరాములు, స్వామి, అబుసాదు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

జన్నారం: నియోజకవర్గంలోని మండల, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్లను నియమించారు. ఖానాపూర్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నానేశ్వర్, మండల కో–ఆర్డినేటర్‌గా షాకీర్ అలీ, కో–కోఆర్డినేటర్‌గా రాహుల్ యాదవ్‌లను నియమిస్తూ నేషనల్ యూత్ కాంగ్రెస్ హెడ్ మనుజైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షిప్త వార్తలు

పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ వహించాలి

తాండూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని రేచిని రైల్వేస్టేషన్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్యారంబ సంరక్షణ విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

'ఎస్టీ రిజర్వేషన్ తొలగించి ముస్లింగా పరిగణించాలి'

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంకు చెందిన మాజీ సర్పంచ్ భుక్య సునీత అలియాస్ షేక్ సనాకు సంబంధించి రిజర్వేషన్ విషయంలో చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్ శనివారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. భుక్య సునీత ముస్లింగా మతం మార్చుకున్నప్పటికీ, ఎస్టీ కోటా కింద రిజర్వేషన్ పొందుతుందన్నారు. అక్రమంగా ఎస్టీ కుల ధృవీకరణ పత్రం, ఓటుహక్కు కలిగి ఉందని ఎస్టీ కోటా నుంచి తొలగించి ముస్లింగా నమోదు చేయాలని తెలిపారు.

ఆదివాసీ అమరుడు రమేశ్ వర్ధంతి

కాసిపేట: ఆదివాసీ అమరుడు రొడ్డ చిన్న రమేశ్ వర్ధంతిని శనివారం దేవాపూర్ నాయకపుగూడలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి విగ్రహం వద్ద నివాళులర్పించారు. జెండావిష్కరణ చేసి, విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, నాయకులు రొడ్డ రాజయ్య, రొడ్డ లచ్చులు, బుర్ర రాజేష్, ఆనందచారి, కోలకాని లక్ష్మి, కొమ్ముల రజిత తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: యూఎస్‌ఎఫ్‌ఐ మంచిర్యాల జిల్లా ప్రథమ మహాసభలను సెప్టెంబర్ 2, 3 తేదీల్లో దండేపల్లిలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. మహాసభలకు విద్యార్థిమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలతో అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల జాబితాల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకొని చర్చించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, నాయకులు మైదం రమేష్, అగ్గి సత్తయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ తదితరులున్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 6నుంచి 10వ తరగతి వరకు గల ఖాళీ సీట్ల భర్తీకి సెప్టెంబర్ 1న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.